అమరుల త్యాగాలు చిరస్మరణీయం

జగిత్యాల, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ అన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఫ్లాగ్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో దేశ రక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులకు ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి నివాళులర్పించారు.


నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

జిల్లాలో 1985 నుంచి ఇప్పటి వరకు 14 మంది పోలీసులు, ఒక హోంగార్డు మరణించారని, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నారని అమరుల ఆశయాల సాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ పటిష్ఠంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సమాజంలో ప్రతిఒక్కరికి రక్షణ కల్పిస్తూ సామాజిక రుగ్మతలను పారద్రోలేందుకు పోలీసుశాఖ శ్రమిస్తుందని విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివన్నారు. అదనపు ఎస్పీ భీంరావు, డీఎస్పీలు రవీంద్రకుమార్, రఘుచందర్, ఉమామహేశ్వర్ రావు, రంగారెడ్డి, డీసీఆర్‌బీ, సీసీఎస్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రఫీక్‌ఖాన్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్, రామక్రిష్ణ, వేణు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.


1993లో సారంగాపూర్‌లో కానిస్టేబుల్ సానగొండ శ్రీనివాస్ నక్సలైట్ల కాల్పుల్లో మృతి చెందగా అతని కుమార్తె భవ్యజ్యోతి, మనవరాలు తనుశ్రీ అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు

తరలొచ్చి.. బాధలు విన్నవించి

ప్రజావాణికి 46 ఫిర్యాదులు

జగిత్యాల, న్యూస్‌టుడే: ప్రజావాణి వినతులకు ప్రాధాన్యతనివ్వాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు విన్నారు. ప్రజావాణి వినతులపై సానుకూలంగా వ్యవహరించాలని పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 46 వినతులు రాగా పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత శాఖలకు రాశారు. అదనపు కలెక్టర్లు పి.రాంబాబు, బి.గౌతంరెడ్డి, మెట్‌పల్లి ఆర్డీవో ఎన్.శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో పి.హన్మంతరావు, అధికారులు పాల్గొన్నారు.


సమస్యలు వింటున్న కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్లు



వెన్నుపూస బాధితులను ఆదుకోవాలి

వెన్నుపూస దెబ్బతిన్న తమను ఆదుకోవాలని పలువురు బాధితులు కోరారు. సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. వెన్నుపూస పూర్తిగా దెబ్బతిన్న తమకు దైనందిన జీవితంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పక్క రాష్ట్రంలో వెన్నుపూస బాధితులకు నెలకు రూ.15 వేలు ఇస్తున్నారని, ఇక్కడ కూడా అమలు చేయాలన్నారు. ఇతరుల సహాయం లేనిదే ఏపని చేసుకోలేకపోతున్నామని మందులు, ఇతర అవసరాలకు ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వం చొరవ చూపి ఆదుకోవాలని కోరారు.

కులగణనలో అవకతవకలు

దూదేకుల కులగణనలో గతంలో అవకతవకలు జరిగాయని నూర్‌బాషా, దూదేకుల సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎ.ఆరిఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.నజీర్, జిల్లా ఉపాధ్యక్షుడు సమియొద్దీన్ తదితరులు ఆరోపించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. దూదేకుల జనాభా 16 లక్షలు ఉండగా సమగ్ర సర్వేలో కేవలం 3.44 లక్షలుగా చూపారని దీనివల్ల అన్ని రంగాల్లో తమకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుతం చేపట్టబోయే కులగణనలో వాస్తవంగా సర్వే జరిపి దూదేకులకు న్యాయం చేయాలని కోరారు.





భూహక్కులు కల్పించండి

గొల్లపల్లి మండలం రాపల్లి గ్రామంలో కొనుగోలు చేసిన భూమికి హక్కులు కల్పించాలని గ్రామ దళితులు కోరారు. 1972లో సర్వే నంబర్ 65లో 6.05 ఎకరాల భూమిని గండ్ర కిషన్‌రావు విక్రయించారని, 1983లో తమ పూర్వీకులు గుడిసెలు వేసుకోగా తర్వాత తాము పక్కా గృహాలు నిర్మించుకున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ధరణీ తెచ్చిన తర్వాత భూములను నివాస స్థలాలుగా చూపారని, 2022 నుంచి అదే భూమిని మొదటి పట్టాదారు గండ్ర కిషన్‌రావు పేరు చేర్చారని ఆపేరు తొలగించి తమకు హక్కులు కల్పించాలని కోరారు.

పరిహారం ఇప్పించండి

బీర్‌పూర్ మండలం రోళ్లవాగు రిజర్వాయర్‌లో ముంపునకు గురైన భూములకు పరిహారం ఇప్పించాలని గణేష్‌పల్లి గ్రామస్థులు కోరారు. ఈ మేరకు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సర్వే నంబర్ 29, 74లో ముంపునకు గురైన 71 ఎకరాలకు పరిహారం ఇచ్చారని మిగతా భూములకు పరిహారం ఇవ్వలేదన్నారు. తర్వాత పరిహారం చెల్లిస్తామని అధికారులు పేర్కొనగా 70 ఏళ్లుగా కబ్జాలో ఉంటున్న తమ భూమిని ప్రస్తుతం అటవీశాఖ అధికారులు అటవీ భూమిగా పేర్కొంటున్నారని కేవలం వ్యవసాయం చేసి జీవించే తమ భూములకు హద్దులు నిర్ణయించి పరిహారం చెల్లించాలని వారు కోరారు.



సమస్యలతోనే సేకరణ

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతుల కరవు

న్యూస్‌టుడే, జగిత్యాల ధరూర్‌క్యాంపు

జిల్లాలో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు సమస్యలకు నిలయంగా మారాయి. 2006 సంవత్సరం నుంచి 35 సీజన్లుగా ధాన్యం, మక్కల సేకరణతో రైతులకు ప్రత్యామ్నాయ విపణులున్నా శాశ్వత సదుపాయాల కల్పనను విస్మరించారు. ప్రస్తుత యాసంగిలో జిల్లాలో వరికోతలు ప్రారంభమై ధాన్యం కల్లాలకు వస్తుండగా కర్షకులకు ఇక్కట్లు కలగకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది.

- జిల్లాలో వరిసాగు: 3.16 లక్షల ఎకరాలు
- ఏర్పాటు చేయనున్న సేకరణ కేంద్రాలు: 421
- సన్నరకాల సాగు: 86 వేల ఎకరాలు
- సగటు దిగుబడి అంచనా: 6.50 లక్షల మెట్రిక్ టన్నులు
- సన్నరకాల సేకరణ కేంద్రాలు: 65
- మొత్తం కొనుగోలు అంచనా: 5 లక్షల మెట్రిక్ టన్నులు

సమస్యలు ఇవీ..

- జిల్లాలో ఇందిరా క్రాంతిపథం మహిళా స్వశక్తి సంఘాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సహకార సంఘాలు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ధాన్యం సేకరణ చేపడుతున్నారు. కాగా తొలిసీజన్లలో ధాన్యంతో పాటుగా మక్కలను, మామిడి కాయలను కొనుగోలు చేయగా ప్రస్తుతం ధాన్యాన్ని మాత్రమే సేకరిస్తున్నారు. దీనికిగాను అన్ని వ్యవస్థల్లోనూ ధాన్యం సేకరణకు శాశ్వత సిబ్బందిని నియమించాల్సి ఉంది.
- జిల్లాలో గడచిన యాసంగిలో ప్యాక్స్ ద్వారా 285, ఐకేపీ ద్వారా 133, మెప్మా ద్వారా 1 కేంద్రాన్ని ఏర్పాటుచేసి 4.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 5 వేల క్వింటాళ్లకన్నా తక్కువ కొనుగోలు చేసిన, అధికంగా ఖర్చుచూపిన దాదాపు 34 ప్యాక్స్ కేంద్రాల స్థానంలో ఐకేపీ ద్వారా ధాన్యం సేకరించాలని నిర్ణయించారు. కొన్నిచోట్ల ధాన్యం సేకరణకు వచ్చిన కమీషన్‌ను పక్కదారి పట్టించారనే ఆరోపణలుండగా ముందుముందు ఇలా జరగకుండా చూడాలి.
- మార్కెట్ యార్డుల్లోని కొన్ని సేకరణ కేంద్రాల్లోనే సిమెంటు గచ్చు అందుబాటులో ఉండగా గ్రామాల్లోని దాదాపు అన్ని కేంద్రాల్లోనూ మట్టికల్లాలు కావటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శాశ్వత స్థలాలున్న కేంద్రాల్లో సిమెంటు గచ్చును నిర్మించాల్సి ఉంది. గతంలో సరఫరా చేసిన టార్పాలిన్‌షీట్లు చిరిగిపోగా నూతనంగా సరఫరా చేయాలి. సేకరణ సంస్థలకు కమీషన్‌ను, రైతులకు క్వింటాలుకు రూ.5 చొప్పున హమాలీ ఛార్జీలను విడుదల చేయాలి.


గొల్లవాడ కేంద్రంలో మట్టికల్లంలో ఆరబెట్టిన ధాన్యం

- తూకం, తేమ యంత్రాలు, గన్నీలు తదితర సామగ్రిని నిల్వచేసేందుకు గదులను ఏర్పాటు చేయాలి. సేకరణ సమయంలో కేంద్రాలవద్ద నీడ, మంచినీరు, విద్యుత్‌వంటి సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించాలి. కేంద్రాల్లో ధాన్యం, తూకంవేసిన బస్తాల రక్షణకు రక్షకులను నియమించాలి.
- ఈ సీజన్‌లో తొలిసారిగా సన్నగింజ రకాలను కొనుగోలు చేయనుండగా ధాన్యం ఎంపికలో తేడా రాకుండా చూడాలి. కేంద్రాల నుంచి మిల్లులకు పంపించిన ధాన్యాన్ని తరుగు, తేమ పేరిట కోతల్లేకుండా చూడాలి, లారీల్లోని బస్తాలను వెంటదివెంట దింపేలా చర్యలు తీసుకోవాలి. కేంద్రాల్లో తగిన సంఖ్యలో హమాలీలను నియమించాలి, ప్రభుత్వ నిర్దేశిత ధర ప్రకారమే హమాలీ ఛార్జీలను రైతుల నుంచి తీసుకునేలా చూడాలి. రైతులనుంచి అదనపు వసూళ్లను అరికట్టాలి.
- డీసీఎంఎస్ కేంద్రాల్లో సంస్థ ఉద్యోగులను నియమించాలి, ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను వెంటదివెంట ఆన్‌లైన్ చేయాలి. పంటను సాగుచేసిన రైతుల వివరాలు పోర్టల్‌లో లేకున్నా ఏఈవో ధ్రువీకరణతో ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. చిరిగిన గన్నీలు కాకుండా మంచి సంచులను, తగినన్ని సరఫరా చేయాలి.
- అన్ని కేంద్రాల్లోనూ రైతులు ధాన్యాన్ని ఆరబెడుతున్నందున వరుసక్రమాన్ని పాటించాలి. లారీల గుత్తేదారు తూకంవేసిన బస్తాలను వెంటదివెంట తరలించేలా చూడాలి లేదా బస్తాల తరలింపు బాధ్యతలను మిల్లర్లకే అప్పగించి వారికే రవాణా ఛార్జీలను చెల్లించటం సత్ఫలితాలనిస్తుంది.



నేలకొరిగిన వరిపంట

ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే సమయంలో అకాల వర్షంతో తీవ్ర నష్టం వాటిల్లింది. బీర్‌పూర్ మండలంలోని తాళ్లధర్మారంతో పాటు పలు గ్రామాల్లో ఈదురు గాలులతో వరి పంట నేలకొరిగింది. దాదాపు వంద ఎకరాలకు పైగా వరిపంట పడిపోవడంతో తీవ్ర నష్టం జరిగిందని, అధికారులు సర్వే నిర్వహించి ప్రభుత్వం నుంచి పరిహారం అందించేలా చూడాలని రైతులు వేడుకుంటున్నారు.

- న్యూస్‌టుడే, సారంగాపూర్

మక్కల కొనుగోలుకు జిల్లాలో 8 కేంద్రాలు

జగిత్యాల వాణిజ్యం: మార్క్‌ఫెడ్ ద్వారా మక్కలను కొనేందుకు జగిత్యాల, కోరుట్ల, కథలాపూర్, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, రాయికల్, ధర్మపురి మార్కెట్ యార్డుల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మార్క్‌ఫెడ్ డీఎం హబీబ్ తెలిపారు. జిల్లాలో 84 వేల మెట్రిక్ టన్నుల మక్కల దిగుబడి అంచనా ఉందన్నారు.

రైతేరాజు 6లో

పారదర్శకతతో ముందుకెళ్తా!

- విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే నా లక్ష్యం
- శాతవాహన ఉప కులపతి ఉమేశ్‌కుమార్

ఈనాడు, కరీంనగర్

విశ్వవిద్యాలయంలో విద్యా వికాసం.. ఉన్నత విలువల ఆచరణపై దృష్టి పెడతానని ఉపకులపతి ఉమేశ్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆయన 'ఈనాడు'తో ముఖాముఖిలో పలు విషయాలు వెల్లడించారు. అన్ని వ్యవహారాల్లో పారదర్శకతతో ముందుకెళ్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పాటుపడతానని పేర్కొన్నారు. సమస్యల సవాళ్లను తనకున్న అనుభవంతో అధిగమిస్తానని.. ఆహ్లాదకర వాతావరణంలో చదువుకునేలా విద్యార్థులకు వసతులు కల్పిస్తానని చెప్పారు.

మార్పు చూపిస్తా

నా హయాంలో కచ్చితంగా పాలనా వ్యవహారాల్లో మార్పు చూపిస్తా. అన్ని విషయాల్లో పారదర్శకతే నా మంత్రం. అదే పంథాలో ముందుకు వెళ్తా. చిన్నచిన్న సమస్యలు ఎక్కడైనా ఉంటాయి. వాటిని నా స్థాయిలో పరిష్కరిస్తా. పెద్ద సమస్యలను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కారమయ్యే విధంగా చూస్తా. గతంలో ఇక్కడ రిజిస్ట్రార్‌గా పనిచేసిన అనుభవం నాకు ఉపయుక్తంగా మారుతుంది. అప్పటికన్నా ఇప్పుడు వీసీ హోదాలో కొన్నింటి విషయంలో నిర్ణయాధికారం ఉండటంతో మెరుగైన చర్యలు తీసుకోగలను.

బాధ్యులపై చర్యలు తప్పవు

విశ్వవిద్యాలయం పరిధిలో గతంలో జరిగిన అక్రమాలు, అధికార దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. నా వంతు సహకారం అందిస్తా. అదే సమయంలో నా దృష్టికి వచ్చిన ఏ విషయాన్నీ విస్మరించను. అక్రమ నియామకాలు, దొడ్డిదారిన పదోన్నతులు.. ఇలా విద్యా వ్యవస్థను అప్రతిష్ఠపాలు చేసిన ప్రతి విషయంపై సమగ్రంగా విచారణ జరుగుతుంది. తప్పకుండా బాధ్యులపై చర్యలుంటాయి.

న్యాక్ గుర్తింపునకు నా మొదటి ప్రాధాన్యం


నా మొదటి ప్రాధాన్యం శాతవాహనకు న్యాక్ గుర్తింపు తేవడం. ఇందుకోసం అవసరమైన ప్రణాళికతో ముందడుగు వేస్తా. గుర్తింపు సాధిస్తే నిధులు సమృద్ధిగా వస్తాయి. విద్యాపరంగా సమూలమైన మార్పులకు అవకాశం ఉంటుంది. 200 ఎకరాల భూమి అందుబాటులో ఉండటంతో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలన్నది నా రెండో ప్రాధాన్యత. తరువాత బీఈడీ, ఎంఈడీ కళాశాలల ఏర్పాటు సహా పీహెచ్‌డీకి అవకాశాన్ని కల్పిస్తాం. దీర్ఘకాలికంగా ఇక్కడ ఉన్న ప్రధాన సమస్యలు జిల్లాకు చెందిన మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా చొరవ చూపిస్తా. మౌలిక వసతుల కల్పన పరంగా మంచి మార్పులు తీసుకొస్తా. ఈ విశ్వవిద్యాలయాన్ని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలబెట్టే విధంగా నా శాయశక్తులా కృషి చేస్తా. మూడేళ్లలో ఇదొక మంచి గురుకులమనే భావనను విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో కల్పిస్తా.

కొత్త కోర్సులు.. పోస్టులు..

జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ-2020) ప్రకారం ఉన్నత విద్యలో ఎన్నో మార్పులొస్తున్నాయి. పోటీ ప్రపంచంలో విద్యార్థికి బహుళ ప్రయోజనంతో కూడిన విద్యను అందించే వ్యవస్థను ఇక్కడ ఏర్పాటు చేస్తాం. ఇష్టానుసారంగా వేరే కోర్సుల్లోకి మారే వెసులుబాటుతోపాటు ఎన్నో అవకాశాలు కొత్త విద్యా విధానంలో ఉండనున్నాయి. ఇక్కడ ప్రస్తుతం నడుస్తున్న సంప్రదాయ కోర్సుల స్థానంలో డిమాండ్ ఉన్న కొత్త కోర్సులను ప్రవేశపెడతాం. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల ఆవశ్యకతను గుర్తిస్తాం. బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీలు అధికంగా ఉన్నాయి. వీటి భర్తీ కోసం ప్రభుత్వానికి విన్నవిస్తా. కొత్త పోస్టులను కూడా మంజూరు చేయిస్తా. గతంలో నేను రిజిస్ట్రార్‌గా ఉన్నప్పుడు ఒకసారి స్నాతకోత్సవం జరిగింది. త్వరలో మరోసారి నిర్వహిస్తాం.

విద్యార్థుల బాధలు తెలిసిన వ్యక్తిని..

మధ్యతరగతి కుటుంబంలో పుట్టి పెరిగిన నాకు పేద విద్యార్థుల బాధలు తెలుసు. దీపం వెలుతురులో చదువుకుని ఈ స్థాయికి వచ్చాను. నేను విద్యార్థుల పక్షపాతిని. రీసెర్చ్ స్కాలర్‌గా విద్యార్థి సంఘ నాయకుడిగానూ పని చేశాను. విద్యార్థులు వచ్చి నాకు సమస్యలు విన్నవించే కన్నా.. నేనే వారి వద్దకు నిత్యం వెళ్తా. ఆకస్మిక తనిఖీలు చేస్తా.



బాధ్యతల స్వీకరణ

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్యులు ఉమేశ్‌కుమార్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మొదట ఆయనకు బోధన, బోధనేతర సిబ్బంది స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమం నిర్వహించిన తదుపరి బాధ్యతలు స్వీకరించారు. వీసీకి పలు ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, వివిధ సంఘాల నేతలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉపకులపతిని కలిసిన వారిలో ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, బీసీ సంఘాల నేత శ్రీధర్ తదితరులు ఉన్నారు.


సమస్యలు వింటున్న ఎస్పీ అశోక్‌కుమార్

బాధితులకు సత్వర న్యాయం జరగాలి

జగిత్యాల, న్యూస్‌టుడే: బాధితులకు సత్వర న్యాయం జరగాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు విన్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని పోలీసుశాఖను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఎస్పీ అన్నారు.

రహదారి నిర్మాణానికి మోక్షమెప్పుడో..?

న్యూస్‌టుడే, కొడిమ్యాల

కొడిమ్యాల మండల కేంద్రంలోని అంగడిబజార్ ప్రాంతం నుంచి బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వరకు గల ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో గ్రామప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సుమారు 1200 మీటర్ల రహదారి పూర్తిగా గుంతలు పడటంతో వాహనాల రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై దుమ్ము, ధూళితో దుకాణాదారులు, రోడ్డు పక్కనే ఇళ్లు ఉన్నవారు అనారోగ్యాలకు గురవుతున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించిన నూతన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు, గ్రామస్థులు కోరుతున్నారు.


కొడిమ్యాల అంగడిబజార్ నుంచి బస్టాండు వరకు గల ప్రధాన రహదారి

ప్రతిపాదనలకే పరిమితం..

అంగడిబజార్ నుంచి బస్టాండు వరకు ప్రధాన రహదారి నిర్మాణానికి గతంలో పలువురు ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినప్పటికీ నెరవేర్చడంలో విఫలమయ్యారు. నాలుగేళ్ల కిందట ఆర్అండ్‌బీ అధికారులు తారురోడ్డు నిర్మాణానికి సర్వే చేపట్టి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి రహదారి నిర్మాణానికి మంజూరు చేయాలని గ్రామస్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డంతా గుంతలే...

రోడ్డంతా గుంతలమయంగా మారడంతో బస్టాండు నుంచి అంగడిబజార్ వెళ్లాలంటే గర్భిణులు, అనారోగ్యంతో ఉన్నవారు, వృద్ధులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో గుంతల కారణంగా పలువురు వాహనదారులు అదుపుతప్పి పడిపోవడంతో ఆసుపత్రి పాలయ్యారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో పాటు వాహనాలు సైతం దెబ్బతింటున్నాయి. ప్రజాప్రతినిధులు స్పందించి నూతన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలి.


- చిరంజీవి, వ్యాపారి

దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నాం.. - వీరబత్తిని రాజు, వ్యాపారి

ప్రధాన రహదారిపై రాకపోకలు ఎక్కువగా ఉండటంతో దుమ్ము, ధూళి చెలరేగి దుకాణాల్లోని సామగ్రిపై పేరుకుపోతోంది. అంతేగాక రోడ్డు వెంట వస్త్ర దుకాణాలు, లేడీస్ ఎంపోరియం వంటివి ఎక్కువగా ఉండటంతో దుమ్ము చేరి పాడవుతున్నాయి. నిత్యం దుమ్మును దులుపుకోలేక ఇబ్బందులు పడుతున్నాము. శ్వాస సంబంధ వ్యాధులు ఉన్నవారు సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారసంత రోజున సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది.



అసంపూర్తి కాలువలతో ఇబ్బందులు

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: మెట్‌పల్లిలో జాతీయ రహదారికి ఇరువైపులా అయిదేళ్ల కిందట మురుగుకాల్వలు పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. కొత్తబస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవనం ఎదుట జాతీయ రహదారిని ఆనుకొని మురుగుకాల్వను తవ్వి వదిలేశారు. మురుగునీరంతా నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. కొత్తబస్టాండ్ పెట్రోల్ బంక్ మలుపు వద్ద మురుగుకాల్వ అనుసంధానం చేయకపోవడంతో చెత్తాచెదారం నిలిచి దుర్వాసనతో పాటు దోమలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కేవలం 10 మీటర్ల వరకు పైపును ఏర్పాటు చేసి కాల్వకు అనుసంధానం చేస్తే మురుగు నిల్వకుండా ఉంటుంది. ఈ విషయంపై పుర కమిషనర్ మోహన్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పరిశీలించి చర్యలు చేపడతామని తెలిపారు.


ప్రభుత్వ ఆసుపత్రి కొత్త భవనం ముందు మురుగుకాల్వ


పెట్రోల్ బంక్ మూలమలుపు వద్ద..

ఆవ సాగు.. ఇదే అదను

జగిత్యాల సహా ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆవ పంట సాగు విస్తీర్ణం పెరుగుతోంది. తక్కువ నీటి వసతి ప్రాంతాల్లో, అడవి పందులు, కోతుల బెడదను తప్పించుకోవడానికి చాలామంది రైతులు యాసంగి పంటగా ఆవపైరును పండిస్తున్నారు. ఆవాల పంటలో మెరైన యాజమాన్యం గురించి పొలాస పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఐ.రజనీకాంత్ వివరించారు.



ఆవ పైరు

■ ఆవపంటను అక్టోబరు నుంచి నవంబరు 25వ తేదీ వరకు విత్తుకోవచ్చు. స్థానిక, సంకర రకాలతో పాటుగా కొన్ని కంపెనీల ద్వారా ఒప్పందంతో రైతులు ఆవాలు సాగు చేస్తున్నారు. నల్లరేగడి నేలల్లో ఎక్కువగా ఆవాలను పండిస్తుండగా రకాలను బట్టి 80-110 రోజుల కాలపరిమితి ఉంటుంది. విత్తిన నెల రోజుల తరువాత 35 కిలోల యూరియాను పైపాటుగా వేయాలి. విత్తిన నెల రోజులవరకు తోటలో కలుపు లేకుండా చూడాలి. నల్లనేలల్లో 3-4 నీటితడులు, తేలిక నేలల్లో పంటను బట్టి 4-5 నీటితడులు అవసరముంటాయి. పైరు మొలిచిన తరువాత 20-25 రోజులకు మొదటి తడినిచ్చి కొమ్మలు వేసే సమయంలో, పూత సమయంలో, గింజలు పోసుకునే దశల్లో తప్పనిసరిగా నీటి తడులను పారించాలి.

■ డైమండ్ బ్యాక్‌మాత్ లద్దె పురుగులు ఆకుల అడుగున చేరి గీరితింటాయి. ఉధ్ధృతి ఎక్కువున్నప్పుడు కొమ్మలను, పూత, పిందెలను కూడా తింటాయి. నివారణకు క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రాము మందును లీటరు నీటికి వంతున కలిపి 10-15 రోజుల వ్యవధిలో రెండుమూడు దఫాలుగా పిచికారి చేయాలి.

■ ఆవాలను ఆలస్యంగా విత్తినప్పుడు పేనుబంక తీవ్రత పెరుగుతుంది. ఈ పురుగు నివారణకు మిథైల్ డెమటాన్ 2 మి.లీ. లేదా డైమిథోయేట్ 1.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రాము మందును ఒక లీటరు నీటికి వంతున కలిపి పిచికారీ చేయాలి. అవసరమైతే 10-15 రోజుల వ్యవధిలో మరోసారి మందుద్రావణాన్ని పిచికారీ చేయాలి.

■ డౌనీమిల్డ్యూ తెగులు సోకిన మొక్కల ఆకులు, కాండం, పువ్వులపైన, కాయల మీద తెల్లటి ఉబ్బెత్తు పొక్కులు కనిపిస్తాయి. డౌనీమిల్డ్యూతో పాటుగా ఆల్టర్నేరియా ఆకుమచ్చ నివారణకు 2.5 గ్రాముల మైథేన్-ఎం-45 లేదా 2.5 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి వంతున కలిపి పైరుపై పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

■ మంచు ఎక్కువగా ఉంటే బూజు తెగులు ఆశిస్తుంది. ఆకులపై తెల్లటి బూజు వంటి పదార్థం ఏర్పడుతుంది. నివారణకు వెట్టబుల్ సల్ఫర్ 3 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా కెరాథేన్ 2.5-3 గ్రాముల మందును ఒక లీటరు నీటికి వంతున కలిపి వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

- న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

పంటల సాగులో కర్షకుల సందేహాలకు అగ్రానమీ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ పి.మధుకర్‌రావు నివృత్తి చేశారు.



? కాలీఫ్లవర్‌లో గోధుమ రంగు మచ్చలు వస్తున్నాయి. - మల్లన్న, తిమ్మాపూర్

✓ బోరాన్ ధాతు లోపం కారణం. లీటరు నీటికి డైసోడియం ఆక్టా బోరేట్ మందు 2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

? పసుపులో దుంప కుళ్లు వ్యాపిస్తోంది. నివారణకు ఏం చేయాలి. - తిరుపతిరెడ్డి, మల్యాలపల్లి

✓ **సమాధానం:** దుంప కుళ్లును గుర్తించిన వెంటనే నివారణకు 3 గ్రాముల రిడోమిల్ ఎంజెడ్‌ను లీటరు నీటిలో కలిపి దుంపలు తడిచేలా మొక్కల చుట్టూ తడపాలి.

? చిక్కుడులో పేనుబంక నివారణకు ఏం చేయాలి. - కరుణాకర్, కరీంనగర్

✓ ఫిప్రోనిల్ మందు 2 మి.లీ.ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. - న్యూస్‌టుడే, జమ్మికుంట

నారుమడి యాజమాన్యంతోనే మొక్కల ఎదుగుదల

ప్రస్తుత యాసంగిలో కూరగాయల సాగుకు ఇది అనువైన సమయం కాగా నారుమడిలో చేపట్టే యాజమాన్యంతోనే నారు సరిగా ఎదిగి నాటిన తరవాత మంచి కాపు వస్తుంది. టమాట, వంగ, మిరప, ఉల్లి, క్యాబేజీ, కాలీఫ్లవర్ తదితరాల్లో విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్లు, రసం పీల్చు పురుగు నివారణకు ఆర్గోపొస్సెట్, ఇమిడాక్లోప్రిడ్ వంటివాటితో విత్తనశుద్ధి చేయాలి. వడలు తెగులు నివారణకు ట్రైకోడెర్మా విరిడి పట్టించాలి. ఎత్తయిన నారుమడిని తయారు చేసుకుని వరుసల్లో విత్తనాలను విత్తుకోవాలి. విత్తనాలు మొలకెత్తే వరకు రోజ్‌క్యానుతో నీటిని చల్లాలి. నారుమడిలో కలుపు లేకుండా చూడాలి. నారు మొలకెత్తిన 15 రోజులకు ఫ్యూరడాన్ 3జి గుళికలను చల్లాలి. రసం పీల్చు పురుగు, తెగుళ్ల నివారణకు డైమిథోయేట్, మాంకోజెబ్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. ఆరోగ్యవంతంగా ఎదిగిన నారును సాయంత్రం పూట ప్రధాన పొలంలో నాటుకొని నీటి తడి పారించాలి.

- న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

లాభాల మిరప

న్యూస్‌టుడే, గంగాధర

ఇటీవల భారీ వర్షాలు కూరగాయల సాగు రైతులకు నష్టాన్ని మిగిల్చాయి. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో గంగాధర మండలం లింగంపల్లికి చెందిన పోల్సాని కిరణ్‌రావు కేవలం 25 గుంటల్లో మిరప పంట సాగు చేసి లాభాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



25 గుంటలు.. రూ.60 వేల పెట్టుబడి..

కోతుల బెడద లేని మిరప సాగు ఎంచుకొన్న కిరణ్‌రావు.. 25 గుంటల్లో సాగు చేపట్టారు. డెల్మన్-887, జెర్ఫీ-56 రకం విత్తనాలకు రూ.5 వేలు వెచ్చించారు. దున్నకానికి రూ.4 వేలు, పురుగు మందుల పిచికారీకి రూ.15 వేలు, మల్చింగ్‌కు రూ.10 వేలు, కోడి ఎరువులకు రూ.8 వేలు, ఆకుల మందులకు రూ.6 వేలు, కర్రలు పాతడానికి కూలీలకు రూ.6 వేలు, ఇతర ఖర్చులు రూ.5 వేలు కలిపి రూ.60 వేల పెట్టుబడి పెట్టారు. రెండు నెలలకు మిరప కాత మొదలవగా ఇప్పటికే 60 క్వింటాళ్ల మిరపకాయలను కరీంనగర్ మార్కెట్‌లో విక్రయించారు. కిలోకు రూ.20 చొప్పున రూ.1.20 లక్షల ఆదాయం సమకూరింది. పెట్టుబడులుపోను రూ.60 వేల లాభం వచ్చింది. మరో మూడు నెలల్లో దాదాపు 80 క్వింటాళ్ల దిగుబడి రానుంది. మరో 30 గుంటల్లో మిరప సాగుకు దుక్కి సిద్ధం చేశారు. వరి, మొక్కజొన్న, ఇతర పంటలు సాగు చేస్తే పెట్టుబడులు కూడా గిట్టుబాటు కాలేదని రైతు తెలిపారు. మల్చింగ్, కర్రలు పాతి మిరప చెట్ల కొమ్మలు నేలకు తాకకుండా చర్యలు తీసుకోవడంతో కాత బాగా వచ్చిందని చెప్పారు.

పోషకాలు.. ఆరోగ్యానికి బాటలు


నేడు జాతీయ గింజల దినోత్సవం

న్యూస్‌టుడే, కరీంనగర్ సాంస్కృతికం


ఆరోగ్యకర జీవన విధానంపై ప్రజల్లో రోజురోజుకు అవగాహన పెరుగుతోంది. ప్రచార మాధ్యమాలు.. వైద్య నిపుణుల సలహా మేరకు ఆహార పద్ధతుల్లో మార్పులు చేసుకుంటున్నారు. నిత్యం భుజించే పదార్థాలకు భిన్నంగా ఆలోచిస్తున్నారు. రోగ నిరోధక శక్తిని పెంపొందించుకుంటున్నారు. రోగాలతో మందులకు వెచ్చించే సగం డబ్బులతో.. అవి రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటిస్తున్నారు. కార్బొహైడ్రేట్లకు బదులుగా పోషకాహారంపై దృష్టి సారిస్తున్నారు. కరోనా తర్వాత అధిక మంది గింజలు తింటూ ఆరోగ్యాన్ని పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. నేడు జాతీయ గింజల దినోత్సవం సందర్భంగా వాటి వినియోగం ఉమ్మడి జిల్లాలో ఎలా పెరిగింది. వాటితో ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో వివరిస్తూ 'న్యూస్‌టుడే' కథనం.

పెరిగిన వినియోగం..

కరోనా తర్వాత ఉమ్మడి జిల్లాలో గింజల వినియోగం పెరిగింది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు వీటిని తింటున్నారు. కాకపోతే ఖర్చు ఎక్కువ కావడంతో సగం మంది మాత్రమే వీటిని తీసుకుంటున్నారు. సామాన్య కుటుంబాలు మాత్రం పేదోడి గింజగా పేరొందిన వేరుశనగను తింటున్నారు. 20 ఏళ్ల కిందట కరీంనగర్ టవర్ సర్కిల్‌లో గింజల దుకాణాలు ఒకటి, రెండు మాత్రమే ఉండేవి. ఇప్పుడు నగరంలో చాలా ప్రాంతాల్లో దుకాణాలు వెలిశాయి. కరీంనగర్, పెద్దపల్లి, గోదావరిఖని, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రాల్లో దుకాణాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఒకప్పుడు జనాభాలో 5 శాతం మంది మాత్రమే వీటిని తినేవారు. ప్రస్తుతం 40 శాతం మంది ఏదో ఒకటి, రెండు రకాలు కొనుక్కొని వెళ్తున్నారని వ్యాపారి రమేష్ తెలిపారు.



ఖర్చు కంటే ఆరోగ్యం ముఖ్యం..



బయట ఏ ఆహారం తీసుకున్నా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. నాణ్యత, శుచి, శుభ్రత పాటించడం తగ్గిపోయింది. కరోనా తర్వాత ప్రతి రోజు ఉదయం గింజలు, ఎండుఫలాలను తీసుకుంటున్నా. ఖర్చు కంటే ఆరోగ్య ముఖ్యమని భావించి వీటిని తీసుకుంటున్నా. మధ్యాహ్నం కొద్దిగా అన్నం తింటున్నా.

- రాజన్న, నీటి పారుదల శాఖ ఉద్యోగి

మా పిల్లల స్నాక్స్ బాక్స్‌లో..



మా ఇద్దరు పిల్లలు బడికి స్నాక్స్ తీసుకెళ్తుంటారు. అందులో బయటి తినుబండారాలు పెట్టను. పండ్లు పెడదామన్నా.. మధ్యాహ్నం వరకు వాడిపోతున్నాయి. అందుకనే బాదం, కాజులాంటివి పెట్టి పంపిస్తున్నాం. కొన్ని సార్లు బాదం, కాజు, ఎండుద్రాక్ష, కర్జూరాలతో లడ్డూగా చేసి ఇస్తున్నాం. ఒక్కోసారి పల్లి పట్టీలు చేస్తున్నా. బాదం నానబెట్టి తినిపిస్తుంటాం. - రంగ అనూష, గృహిణి, కరీంనగర్

విటమిన్లు.. ఖనిజాలు..


■ గింజలు బాదం, వాల్‌నట్స్, జీడిపప్పు, పిస్తా, పొద్దుతిరుగుడు ఇలా అనేక రకాల్లో లభిస్తున్నాయి. వీటిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు(మాంసకృత్తులు), ఫైబర్(పీచు), విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ప్రస్తుతం చాలామంది అల్పాహారంలో భాగంగా వీటిని తీసుకుంటున్నారు. రాత్రిపూట తీసుకుంటే జీర్ణ సంబంధ సమస్యలు వస్తాయి.



- సాయిప్రియ, పోషకాహార నిపుణురాలు



■ బరువు తగ్గాలనుకునేవారు ప్రతి రోజు గుప్పెడు గింజలు ఆహారంలో భాగం చేసుకోవాలి.



■ **వాల్‌నట్స్ :** మెదడు ఆరోగ్యానికి దోహదపడతాయి. వీటిలోని కాల్షియం, మెగ్నీషియం వంటివి ఎముకల ఆరోగ్యాన్ని కాపాడతాయి. ఆర్థరైటిస్ వంటి వ్యాధుల బారిన పడకుండా రక్షిస్తాయి.



■ **జీడిపప్పు:** గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వు ఇందులో ఉంటుంది. అల్పాహారంలో భాగంగా తీసుకుంటే మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. గుండె జబ్బులు నియంత్రణలో ఉంటాయి.

గుమ్మడిగింజలు: శరీరానికి ప్రొటీన్ మెగ్నీషియం, ట్రిప్టోఫాన్‌లు అధికంగా లభిస్తాయి.

■ **పొద్దుతిరుగుడు విత్తనాలు:** కంటిచూపు మెరుగుపరచడంతో పాటు శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరగకుండా చూస్తాయి.



■ **బాదం:** విటమిన్స్‌తోపాటు కొవ్వు, ప్రొటీన్ అధికంగా లభిస్తాయి. శరీరాన్ని దృఢంగా ఉంచడంలో సహాయపడతాయి.

■ **పిస్తా పప్పులు:** వీటితో శరీరానికి అధిక ప్రొటీన్ లభిస్తుంది. కంటి చూపు మెరుగుపర్చడంలో మేలు చేస్తుంది.

■ **వేరుశనగలు(పల్లీలు):** కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్, అధిక రక్తపోటు వంటి సమస్యల నుంచి బయటపడటానికి సహాయపడతాయి.



ఎస్సారెస్పీకి భారీగా వరద

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: గోదావరి పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి 67,562 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 17 స్పిల్‌వే గేట్లద్వారా 52,108 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువకు 5,800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్లద్వారా 2,200, లక్ష్మీ కాలువకు 150, వరద కాలువకు 5 వేలు, సరస్వతి కాలువకు 500, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీటినిల్వ, 1091.0 అడుగుల నీటిమట్టాన్ని కొనసాగిస్తున్నారు.

పెరిగిన పత్తి విక్రయాలు

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు క్రమేణా పెరుగుతున్నాయి. సోమవారం యార్డుకు 251 ట్రాలీల విడిపత్తి విక్రయానికి రావటం విశేషం. ప్రస్తుత సీజన్‌లో మార్కెట్‌కు అధికంగా వచ్చిన పత్తి ఇదే. బిడ్డింగ్‌లో క్వింటాకు కనిష్ఠంగా రూ.6,000 గరిష్ఠంగా రూ.7,000 ధర పలికింది. 25 క్వింటాళ్ల బస్తాల పత్తిని రూ.6,400 నుంచి రూ.6,500 దాకా వ్యాపారులు ఖరీదు చేశారు. మార్కెట్‌లో శుక్రవారం పలికిన ధరే సోమవారం పలికింది. బిడ్డింగ్‌ను మార్కెట్ కార్యదర్శి రాజా పరిశీలించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలను త్వరలోనే ప్రారంభించే అవకాశం ఉందని ఆయన చెప్పారు. దీపావళి సమీపిస్తుండటంతో అధిక పత్తిని రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు. ధర నిలకడగా పలుకుతున్న పత్తిని అధిక తేమతో రైతులు విక్రయానికి తీసుకొస్తున్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. స్థానిక సీసీఐ సిబ్బంది ఒకరు మార్కెట్ యార్డులో పత్తి నాణ్యతను పరిశీలించారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ దందా

న్యూస్‌టుడే, రామడుగు

రామడుగు మండలం వన్నారం వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా దందా కాసులు కురిపిస్తోంది. నిత్యం 50 ట్రాక్టర్లతో సుమారు 200 ట్రిప్పులు అక్రమంగా తరలిస్తున్నారు. ఒక్కో ట్రిప్పు ఇసుకకు రూ.2 వేల నుంచి రూ.3 వేలు వసూలు చేస్తున్నారు. పగలు బహిరంగంగా తరలిస్తే రైతులు వ్యతిరేకిస్తారని, చీకటి పడగానే ట్రాక్టర్లను వాగులోకి తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా రామడుగు మండలం సరిహద్దు గ్రామమైన వన్నారం నుంచి బైపాస్ దారి కొత్తపల్లి, కరీంనగర్‌కు తీసుకెళ్లేందుకు అవకాశంగా మారింది. సంబంధిత అధికారులకు మామూళ్లు ముట్టజెప్పడంతో అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోందని సమాచారం. గతంలో సర్పంచి ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలని పంచాయతీ కార్యాలయంలో తాళం వేసుకొని నిరసన తెలిపారు. కానీ ఇసుక అక్రమ రవాణాను అధికారులు అరికట్టలేదు. నిత్యం రూ.4 లక్షల విలువైన ఇసుక అక్రమ దందా కొనసాగుతోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ గ్రామంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి ఆదాయం లభించేదని తెలిపారు.



వన్నారం వాగులో ఇసుక టాక్టర్ల గుర్తులు

అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

కరీంనగర్ న్యాయవార్తలు, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ సోమవారం కరీంనగర్ మొదటి అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి(పోక్సో కోర్టు) డి.వెంకటేశ్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. రామడుగు మండలంలోని ఒక గ్రామానికి చెందిన ఇంటర్ చదివే బాలిక బంధువులు బోయినపల్లి మండలంలోని ఒక గ్రామంలో ఉండటంతో తరచూ అక్కడికి వెళ్లేది. అదే గ్రామానికి చెందిన సంపంగి ప్రేమ్‌కుమార్ అనే యువకుడు బాలికతో పరిచయం పెంచుకొని ఫోన్లో మాట్లాడేవాడు. 2022 ఫిబ్రవరి 21న బాలికను తన గ్రామానికి రమ్మని లేకుంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడంతో అతని వద్దకు వెళ్లింది. ఆమెను వరంగల్ జిల్లాకు తీసుకెళ్లి పెళ్లి చేసుకొని, బలవంతంగా అత్యాచారం చేశాడు. అనంతరం హైదరాబాద్‌కు తీసుకెళ్లి, అక్కడి నుంచి కరీంనగర్ తీసుకొచ్చి బస్టాండ్‌లో వదిలివెళ్లాడు. ఆమె తల్లిదండ్రుల వద్దకు చేరుకొని జరిగిన విషయాన్ని చెప్పింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు రామడుగు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితున్ని అరెస్ట్ చేసి.. దర్యాప్తు అనంతరం చొప్పదండి సీఐ రవీందర్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ శరత్ వాదించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి డి.వెంకటేష్ ప్రేమ్‌కుమార్‌కు జైలు శిక్ష విధించారు.



కదంబాపూర్: దామెర చెరువులో వలస పక్షులు

వలస పక్షుల కనువిందు

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కదంబాపూర్ శివారులోని దామెర చెరువులో ఎర్రకాళ్ల కొంగలుగా పిలువబడే 'పెయింటెడ్ స్టార్క్స్' కనువిందు చేస్తున్నాయి. పొడవైన ముక్కు, గులాబీ రంగు కాళ్లు, రంగురంగుల రెక్కలు కలిగి ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. చిన్న కప్పల్ని, చేపల్ని ఆహారంగా తీసుకునే వీటి జీవిత కాలం 28 సంవత్సరాలు. కొంగజాతికి చెందిన ఈ వలస పక్షులు.. సాధారణంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని కొల్లేరు, నేలపట్టు సరస్సుల్లో దర్శనమిస్తాయి. తెలంగాణలోని కొన్ని ప్రాంతాల చెరువులు, కుంటల్లో అక్టోబర్ నుంచి జూన్ వరకు ఇవి కనిపిస్తుంటాయి. ఈ పక్షులు చెరువు, కుంటల సమీపంలో ఉండే చెట్లపై గూళ్లు కట్టుకొని గుడ్లు పెట్టి తమ సంతానోత్పత్తిని పెంపొందించుకొని పిల్లలతో సహా వలస వెళ్తుంటాయని జగిత్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.సంగీతారాణి తెలిపారు.

- ఈనాడు, కరీంనగర్, న్యూస్‌టుడే, సుల్తానాబాద్

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు నరేందర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సిరిసిల్లలోని గీతానగర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో షీ టీం అధికారులు మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని కొంత మంది బాలికలు షీ టీం సిబ్బంది వద్దకు వచ్చి ఉపాధ్యాయుడు నరేందర్ కొద్ది రోజులుగా విద్యార్థినుల పట్ల బ్యాడ్ టచ్ చేస్తూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినులు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

పది రోజులే గడువు

ఉమ్మడి జిల్లాలో 71 శాతమే సీఎంఆర్ సేకరణ

ఈనాడు, సిరిసిల్ల

ప్రభుత్వం సీఎంఆర్ సేకరణలో జాప్యం వీడటం లేదు. మర ఆడించిన బియ్యం నింపేందుకు గన్నీ సంచుల కొరత, గోదాంల్లో స్థలాభావం తదితర కారణాలతో లక్ష్యం చేరుకోవడంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉమ్మడి జిల్లాలో 2023-24 ఖరీఫ్ సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) సేకరణ లక్ష్యం 71 శాతం చేరుకుంది. ఈ నెల 31తో గడువు ముగుస్తుంది. ఇప్పటికే ప్రభుత్వం పలుమార్లు పొడిగిస్తూ వచ్చింది. పది రోజులే సమయం ఉండటంతో శత శాతం పూర్తి చేయడంపై సందిగ్ధం నెలకొంది.

ఉమ్మడి జిల్లాలో 2023-24 ఖరీఫ్ సీజన్‌కు పౌరసరఫరాలశాఖ వివిధ కేంద్రాల ద్వారా 30.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. నాలుగు జిల్లాల పరిధిలోని మిల్లులు 20.33 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సీఎంఆర్‌గా ఇవ్వాలి. ఇప్పటి వరకు 15.05 లక్షల మెట్రిక్ టన్నులు ఇచ్చారు. ప్రతి సీజన్‌లోనూ మిల్లర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారు.

■ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి ఇచ్చే క్రమంలో నాణ్యత పేరుతో కోత విధించడం, నిల్వ చేద్దామంటే గోదాంల్లో స్థలాభావం ఇవన్నింటికీ తోడు రవాణా ఛార్జీలు భారంగా మారుతున్నాయి.

■ ఖరీఫ్ సీజన్‌కు ఇంకా 29 శాతం బియ్యం సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లాలో 2023-24 వానాకాలం ధాన్యం సేకరణ (లక్షల మెట్రిక్ టన్నుల్లో)

	పెద్దపల్లి	జగిత్యాల	కరీంనగర్	రాజన్నసిరిసిల్ల
సేకరించింది	1.92	3.10	23.24	2.07
ఇవ్వాల్సింది	1.29	2.07	15.62	1.35
అందజేసింది	0.88	1.35	12.23	1.05



మిల్లులో బియ్యం నిల్వలు

■ 2023-24 రబీ సీజన్‌కు సంబంధించి 50శాతం పైనే సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది. కాగా దీనికి గడువు ఉండటంతో ప్రస్తుతం మిల్లర్లు గత ఖరీఫ్ సీజన్‌పై దృష్టి సారించారు.

గడువులోపు పూర్తిచేస్తాం

జిల్లాలో బియ్యం సేకరణ లక్ష్యాలను గడువులోపు పూర్తి చేస్తాం. ప్రత్యేక అధికారులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి మిల్లుల వారీగా నిత్యం పర్యవేక్షిస్తున్నాం. మిల్లర్లు అన్ని సమస్యలను అధిగమించి సేకరణ లక్ష్యం శతశాతం చేరుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

-భీమ్యానాయక్, అదనపు కలెక్టర్, రాజన్న సిరిసిల్ల

జరిమానా

ప్రభుత్వానికి రెండు, మూడు సీజన్లుగా సీఎంఆర్ అప్పగించడంలో జాప్యం చేస్తున్న మిల్లర్లను పౌరసరఫరాలశాఖ డిఫాల్టర్లుగా గుర్తించింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పది మిల్లులు ఉన్నాయి. జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లోనూ పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఎల్లారెడ్డిపేట మండలంలోని ఒక మిల్లరు 2021-22 సంవత్సరానికి 41 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని 2023 మార్చిలోగా సీఎంఆర్‌కు ఇవ్వాలి. గడువు పూర్తయినా ఇంకా 1,450 క్వింటాళ్ల సీఎంఆర్ ఇవ్వలేదు. పౌరసరఫరాలశాఖ ఆ మిల్లుకు రూ.5.56 లక్షల పెనాల్టీ విధించింది.

ఇవీ సమస్యలు...

ప్రభుత్వం ధాన్యం కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా మిల్లింగ్ చేస్తున్నా మిల్లర్లు పలు సమస్యలతో సీఎంఆర్ ఇవ్వలేకపోతున్నారు.

■ ప్రభుత్వం మిల్లులకు అప్పగించిన ధాన్యాన్ని టెస్ట్ మిల్లింగ్ చేశాకే సేకరణ లక్ష్యం నిర్ణయించాలి. దొడ్డు రకం క్వింటాకు 67 కిలోల బియ్యం ఇవ్వాలి. మిల్లింగ్ అయ్యాక సగటున 62 కిలోలు మాత్రమే వస్తుంది.

■ పోర్టిఫైడ్ బియ్యం కోసం మిల్లుల్లో ఎఫ్ఆర్‌కే, సార్టెక్స్ యంత్రాలు అమర్చుకున్నారు. క్వింటాల్‌కు 3 యూనిట్లు ఖర్చయ్యేది సగటున 4.5 యూనిట్లకు పెరిగింది. దీంతో మిల్లు ఎల్‌టీ కేటగిరి నుంచి హెచ్‌టీలోకి మారుతుంది. దీంతో విద్యుత్తు బిల్లులు భారంగా మారాయి.

■ పాత గన్నీ సంచుల్లో బియ్యం నింపి గోదాంల్లో నిల్వ ఉంచుతున్నారు. ధాన్యం సంచులను శుభ్రం చేయకపోవడంతో అందులో కాప్రా పురుగులు పెరుగుతున్నాయి. దీంతో ఎఫ్‌సీఐ అధికారులు బియ్యం తీసుకోవడం లేదు.

■ మిల్లర్లు ధాన్యం మర ఆడించినందుకు క్వింటా బియ్యానికి రూ.10, బియ్యాన్ని గోదాంలకు తరలించే రవాణా ఛార్జీలను ప్రభుత్వం ఆరేళ్లుగా ఇవ్వడం లేదు.

■ గోదాంల్లో బియ్యం నిల్వ చేసినందుకు క్వింటాకు రూ.240, క్వింటా ధాన్యానికి కిలో తరుగును ప్రభుత్వం మిల్లర్లకు ఇవ్వాల్సి ఉన్నా అయిదేళ్లుగా చెల్లించడం లేదు.

మేమున్నాం.. మీకు తోడుగా... (10 AM TO 1 PM)
జగిత్యాల 94400 23123
కోరుట్ల 9491324656 ధర్మపురి 94403 88638

న్యూస్‌టుడే, మల్లాపూర్

? మల్లాపూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించి, నిర్మల్, మెట్‌పల్లి, జగిత్యాల డిపోల బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలి. - రుద్ర సురేష్, మల్లాపూర్

✓ త్వరలోనే మల్లాపూర్ బస్టాండ్‌లో గైడ్‌ను నియమించి మూడు డిపోల బస్సులు నిలిపేలా చర్యలు తీసుకుంటాం.- దేవరాజ్, డిపో మేనేజర్ మెట్‌పల్లి

న్యూస్‌టుడే, సారంగాపూర్

? పెంబట్ల గ్రామం నుంచి పెద్దమ్మ ఆలయం, పంట పొలాలకు వెళ్లే రహదారి పూర్తిగా బురద, గుంతలతో ఇబ్బందిగా ఉంది. ఇప్పటికే రహదారి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించినప్పటికీ పనులు ప్రారంభించకపోవడంతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. - తెలు రాజు, పెంబట్ల

✓ టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. - ఇంజినీరింగ్ అధికారులు

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థినులతో అధ్యాపకులు

కొడిమ్యాల, న్యూస్‌టుడే: కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌ఛార్జి వ్యాయామ అధ్యాపకులు బి.భాస్కర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన క్రికెట్ ఎంపిక పోటీల్లో అండర్-19 బాలికల విభాగంలో చొక్కాల వైష్ణవి, సామల పూజ, మచ్చ నవిత, అండర్-19 బాలుర విభాగంలో ఎర్రోజు తక్షిల్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను జగిత్యాల జిల్లా నోడల్ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.వేణు, అధ్యాపకులు అభినందించారు.

అంతర్ జిల్లా అథ్లెటిక్స్‌కు..

మేడిపల్లి, న్యూస్‌టుడే: మేడిపల్లి మండలం పోరుమల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి జి.మనోహర్ అంతర్ జిల్లా 800 మీటర్ల పరుగుపందెం పోటీలకు ఎంపికయ్యాడు. జగిత్యాలలో జరిగిన ఎస్జీఎఫ్ పోటీల్లో మనోహర్ ప్రథమ స్థానం పొందాడని ప్రధానోపాధ్యాయురాలు కరుణ అభినందించారు. ఉపాధ్యాయులు శంకర్, హరికిరణ్, వేణుమాధవ్, రమేశ్, నరేందర్, మల్లేశం గౌడ్, శ్రీనివాస్ అభినందించారు.

న్యాయం చేయాలని రహదారిపై బైఠాయింపు


మెట్‌పల్లిలో ఆందోళన చేస్తున్న దృశ్యం

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: న్యాయం చేయాలంటూ మల్లాపూర్ మండలం ఒబులాపూర్‌లో హత్యకు గురైన పల్లెపు సాయిలు భార్య ఇద్దరు కుమార్తెలతో కలిసి సోమవారం మెట్‌పల్లి కొత్తబస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించింది. సాయిలు మృతదేహానికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో శవపరీక్ష ముగిసిన అనంతరం న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని తీసుకెళ్లబోమని చెప్పగా పోలీసులు సర్దిచెప్పినా వినలేదు. బంధువులతో కలిసి రహదారి బైఠాయించారు. హత్యకు పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి చేరుకొని సముదాయించినా న్యాయం జరిగే వరకు వెళ్లేది లేదని పేర్కొన్నారు. ఆత్మహత్యే శరణ్యమంటూ డీజిల్ డబ్బా చేతిలో పట్టుకోగా పోలీసులు అప్రమత్తమై లాక్కొన్నారు. చివరకు సముదాయించి ఆందోళన విరమింపజేశారు.

తప్పిన ప్రమాదం

మల్లాపూర్, న్యూస్‌టుడే: మల్లాపూర్ మండలం వాల్గొండ వద్ద గోదావరిలో సోమవారం ఉదయం ప్రమాదం తప్పింది. వాల్గొండ గ్రామానికి చెందిన గుర్రం పోచయ్య ఇసుకను లోడ్ చేసేందుకు డ్రైవర్ లాలుతో పాటు మరో నలుగురిని వేకువజామున నదిలోకి పంపారు. కూలీలు నదిలో ఇసుకను లోడ్ చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా వరద ఉద్ధృతి పెరగడంతో ప్రాణాలు కాపాడుకునేందుకు ఈత కొడుతూ ఒడ్డుకు చేరారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. డ్రైవర్‌తో పాటు కూలీలకు ఈత రావడంతో వారు క్షేమంగా బయటపడటంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

విద్యుత్తు స్తంభాన్ని సరిచేసిన అధికారులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నంలో ఓ వైపునకు వంగి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ట్రాన్స్‌కో అధికారులు సరి చేశారు. పల్లె ప్రకృతి వనంలో విద్యుత్తు స్తంభం ఓ వైపునకు వంగి ప్రమాదకరంగా ఉండడంతో సోమవారం 'ఈనాడు'లో 'వంగినా..సరిచేయరా' శీర్షికన చిత్ర వార్త ప్రచురితమైంది. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనంలో వంగి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాన్ని సరి చేశారు.

వందనం

ఆలయ ప్రారంభోత్సవం

మెట్‌పల్లి పట్టణం : పట్టణంలోని భక్త మార్కండేయ దేవాలయ కలశారోహణ కార్యక్రమంలో భాగంగా బాల ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. శ్రీమాన్ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి సూచనలతో అర్చకుల విద్యాశేఖర శర్మ ఆధ్వర్యంలో కమిటీ అధ్యక్షుడు ద్యావనపల్లి రాజారాం దంపతుల అధ్యక్షతన సోమవారం బ్రహ్మముహూర్తాన గణపతిపూజ, మాలధారణ విగ్రహాలకు రుద్రాభిషేకం, నవగ్రహ పూజలు నిర్వహించి, గోపూజ చేశారు. సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చెగ్యాం నిర్వాసితులకు చెక్కుల పంపిణీ నేడు

వెల్గటూరు: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితులకు రూ.18 కోట్ల పరిహారం చెక్కులను మంగళవారం పంపిణీ చేయనున్నట్లు తహసీల్దారు శేఖర్ సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన 126 మంది నిర్వాసితుల ఇళ్లకు సంబంధించి పరిహారం మంజూరైనట్లు వివరించారు. ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ చేతులమీదుగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.





'ఈనాడు' ఆధ్వర్యంలో మెట్‌పల్లిలోని నిఖిల్ భరత్ కాన్వెంట్ హైస్కూల్లో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్, చరవాణి వినియోగం ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విద్యార్థులు ప్రతిభ చాటారు. మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులు డి.ప్రసూతి పాల్, బి.హాసిణి, జె.సస్మితలకు పాఠశాల కరస్పాండెంట్ వి.బి.మహర్షి ధ్రువపత్రాలతో పాటు బహుమతులను ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయురాలు మధిరాల అనిత, ఉపాధ్యాయులు రాధ, డైసీ జీని, స్వరూప తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం

నైపుణ్యం చాటి.. బహుమతి సాధించి

పోలీసు అమర వీరులకు నివాళి

సారంగాపూర్, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సోమవారం మండలంలోని బట్టపల్లి వద్ద మావోయిస్టుల చేతిలో అమరులైన హెడ్‌కానిస్టేబుల్ రాజయ్య, శ్రీనివాస్‌కు నివాళులర్పించారు. బీర్‌పూర్‌లోనూ పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సైలు దత్తాద్రి, కుమారస్వామి, శ్రీనివాస్, అహ్మద్, తదితరులున్నారు.

వెల్గటూరు, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వెల్గటూరులోని జగదేవుపేటకు చెందిన పోలీసు అమరుడు పారువెల్లి కిరణ్‌కుమార్ విగ్రహానికి పోలీసులు, కుటుంబ సభ్యులు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. జగదేవుపేటకు చెందిన కిరణ్‌కుమార్ విశాఖ సరిహద్దు, ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి జిల్లా బలిమెలలో నక్సల్స్ జరిపిన లాంచీ పేల్చివేత ఘటనలో అసువులు బాసాడు. వెల్గటూరులో పోలీస్‌స్టేషన్ రోడ్డులో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విధి నిర్వహణలో అసువులు బాసిన కిరణ్‌కుమార్ విగ్రహానికి ఎస్సై ఉమాసాగర్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.

ధర్మపురి : ధర్మపురి పోలీసుస్టేషన్ సమీపంలోని పోలీసు అమర వీరుల శాంతి స్తూపం వద్ద పోలీసు అధికారులు, సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై గంగుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: గొల్లపల్లి నవదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో పోలీసు అమరవీరులకు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి అమరుల త్యాగాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సతీష్, నాయకులు నిషాంత్‌రెడ్డి, మహేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.


సారంగాపూర్‌లో నివాళులర్పిస్తున్న పోలీసులు


వెల్గటూరు: పోలీసు అమరుడి విగ్రహం వద్ద కుటుంబ సభ్యులు


ధర్మపురి: శాంతి స్తూపం వద్ద ..


గొల్లపల్లిలో...

జిల్లాలో 83.35 లక్షల చేప పిల్లల పంపిణీ

కోరుట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో 83.35 లక్షల చేప పిల్లలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం కథలాపూర్ మండలం తాండ్ర్యాల గ్రామంలోని ఊరచెరువులో చేప పిల్లలను వదిలారు. పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని 261 మత్స్య సహకార సంఘాలు ఉండగా ఉందులో 18,500 మంది సభ్యులుగా ఉన్నారన్నారు. మత్స్యకార్మికులు సహకార సంఘాల్లో సభ్యత్వం నమోదు చేయించుకుని బీమా పథకంలో నమోదు చేయించుకొని లబ్ధిపొందాలన్నారు. కలిగోట సూరమ్మ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి విజయభారతి, ఫిషర్మెన్ రాష్ట్ర కార్యదర్శి కల్లెడ గంగాధర్, కాయితి నాగరాజు, తొట్ల అంజయ్య, చెదలు సత్యనారాయణ, ధనుంజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కథలాపూర్: చెరువులో చేప పిల్లలను వేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మహిళల రక్షణకు చట్టం

జగిత్యాల : పనిప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిష్కార చట్టానికి సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కార్యాలయంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలని బాధిత మహిళలు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. అదనపు కలెక్టర్లు పి.రాంబాబు, బి.గౌతంరెడ్డి, జిల్లా సంక్షేమాధికారి డాక్టర్ బి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదులో వేగం పెంచాలి.. పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓటరు నమోదులో వేగం పెంచాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్లతో దృశ్య సమీక్ష నిర్వహించారు. అర్హులైన ఓటర్లందరూ నవంబర్ 6లోగా దరఖాస్తు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. జగిత్యాల కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మెట్‌పల్లి: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో కుంబం పెద్దవెంకన్న(65) సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కొంత కాలంగా మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


రాజయ్య

వెల్గటూరు, న్యూస్‌టుడే: ముక్కట్రావుపేటకు చెందిన మేకల రాజయ్య (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. ఆయన కథనం మేరకు... రాజయ్య మద్యానికి బానిసయ్యాడు. సోమవారం తెల్లవారు జామున ఇంటిలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. మృతుడి సోదరుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి..

మెట్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ కోరుట్ల పట్టణానికి చెందిన నీలం హిమశ్రీ(22) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కోరుట్ల ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నీలం ప్రవీణ్ తన కూతురు హిమశ్రీతో కలిసి ఈ నెల 16న మెట్‌పల్లికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా వట్టివాగు వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంగతి విదితమే. ఇరువురిని నిజామాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ హిమశ్రీ మృతి చెందారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మల్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాలకు చెందిన జితేందర్ సింగ్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. జితేందర్‌సింగ్ కారులో జగిత్యాల నుంచి కరీంనగర్ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో కారు ఓవైపు పూర్తిగా దెబ్బతినగా డ్రైవరు తీవ్రంగా గాయపడటంతో పోలీసులు అతడిని ఆసుపత్రికి తరలించి లారీని ఠాణాకు తరలించారు. ఎస్సై నరేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంతో పాటు పలు గ్రామాల్లోని ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు జగిత్యాల పట్టణ సీఐ సూరం వేణుగోపాల్ తెలిపారు. రూరల్ మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన వడ్లూరి నాగరాజు కొంతకాలంగా ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్నాడని సోమవారం కరీంనగర్ రహదారిపై చిన్నకెనాల్ చౌరస్తాలో అరెస్టు చేశామన్నారు. జగిత్యాల పట్టణంలో ఒకటి, మండలంలో రెండు ఆలయాల్లో చోరీకి పాల్పడ్డట్లు అంగీకరించాడని అతని వద్ద ఒక రాగిబిందె, 2 రాగి ప్లేట్లు, కలశచెంబులు, శఠగోపం, ఇత్తడి గంటా తదితర వస్తువులు, రూ.3500 నగదు స్వాధీన పర్చుకొని రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుడి..

కోరుట్ల, న్యూస్‌టుడే: కథలాపూర్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన నేతుల మల్లేశం హత్యకు కారణమైన రెండో వ్యక్తి మెట్‌పల్లి పట్టణానికి చెందిన గంగమల్లయ్యను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఈనెల 1న మల్లేశం హత్యకు గురైన విషయం తెలిసిందే. హత్యకు కారణమైన మొదటి వ్యక్తి భూపతి గంగారాంను ఈనెల 5న పోలీసులు అరెస్టు చేశామన్నారు. గంగమల్లయ్యను సోమవారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వ్యక్తి మృతదేహం గుర్తింపు

కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని జూనియర్ కళాశాల గ్రౌండ్ సమీపంలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, మూడు రోజులుగా గ్రౌండ్ సమీపంలోని గద్దెలపైనే నిద్రించి ఉన్నాడని కాలనీవాసులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం చనిపోయి ఉండవచ్చని, మృతదేహంను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు పేర్కొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బీమారం, న్యూస్‌టుడే: బీమారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన 2007-2008 బ్యాచ్ విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. ఆనాటి ఉపాధ్యాయులు లింగారెడ్డి, గంగాధర్, రాజారెడ్డి, శరత్, మోహన్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు. మహిళలు బతుకమ్మలతో సందడి చేశారు.

ఆర్‌టీఐ యునైటెడ్ ఫోరం సమావేశం

జగిత్యాల ధరూర్‌క్యాంపు: తెలంగాణ యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ క్యాంపెయిన్, తెలంగాణ జీకే రైతుమిత్ర సమన్వయ సమితి ఆధ్వర్యంలో జగిత్యాలలో సోమవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో సమాచార హక్కుచట్టం కమిషనర్లను నియమించాలని ఫోరం ఉమ్మడి జిల్లా కన్వీనర్ గూడూరి స్వామిరెడ్డి కోరారు. జిల్లా కన్వీనర్ ఎన్నం బాపురెడ్డి, ఆకుల రాజేశ్వర్‌రావు, చిట్టిమల్ల అమరేందర్, దాసండ్ల పోచమల్లు, వడ్లకొండ శ్రీనివాస్, నరహరి, కంకణాల సరోజన, జనార్ధన్‌రెడ్డి, గూడూరి చైతన్యరెడ్డి పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాల్లో అధిక ఛార్జీల వసూళ్లపై ఫిర్యాదు

మల్యాల : మల్యాల మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న కొన్ని మీసేవ కేంద్రాల్లో ఆయా సేవలకు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ మండల యూత్ కాంగ్రెస్ నాయకులు సతీష్‌రెడ్డి, వినయ్, హరినాథ్, మారుతి సోమవారం ప్రజావాణిలో తహసీల్దారు మునిందర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రతి మీసేవ కేంద్రం వద్ద ఏ సేవలకు ఎన్ని డబ్బులు వసూలు చేయాలన్న విషయమై బోర్డులు ఏర్పాటు చేయించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అయోడిన్ లోపంపై అవగాహన తప్పనిసరి

జగిత్యాల, న్యూస్‌టుడే: అయోడిన్ లోపంపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.డి.సమియొద్దీన్ అన్నారు. సోమవారం జరిగిన అవగాహన శిబిరంలో ఆయన పాల్గొన్నారు. తినే ఆహారంలో ప్రతిరోజు అయోడైసిడ్ ఉప్పు ఉండేలా చూడాలని లేనట్లయితే పలు దుష్ప్రభావాలు కలుగుతాయన్నారు. ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్.శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరవు భత్యం విడుదల చేయాలి

జగిత్యాల : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు కరవు భత్యం వెంటనే విడుదల చేయాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తుంగూరి సురేష్ అన్నారు. సోమవారం జగిత్యాల జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 5 విడుతల కరవు భత్యం బకాయి పడిందని హామీ ఇచ్చి ఏడాది కావస్తున్నా నెరవేర్చడం లేదన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయిని విజయానందరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీనివాస్‌గౌడ్, శేఖర్, గుండా శ్రావణ్ తదితరులున్నారు.

ఇసుక అక్రమ తరలింపు అరికట్టాలని వినతి

కోరుట్ల: కథలాపూర్ మండలం తక్కళ్లపెల్లి గ్రామశివారులోని వాగులోంచి ఇసుక అక్రమ తరలింపును అరికట్టాలంటూ సోమవారం గీతకార్మికులు తహసీల్దార్ వినోద్‌కు వినతి పత్రం సమర్పించారు. వాగులో విచ్చలవిడిగా ఇసుకను తవ్వి తీయడంతో ఒడ్డుకున్న ఈతచెట్లు పడిపోవడంతో గీతకార్మికులు ఉపాధిని కోల్పోతున్నామని తెలిపారు. అక్రమ ఇసుక వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వాపోయారు.

ఇసుక అక్రమ రవాణాకు టెండరు..?

రాయికల్: రాయికల్ మండలం మూటపల్లి పెద్దవాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేయడానికి అక్రమంగా టెండర్లు నిర్వహించినట్లు ఆలస్యంగా వెలుగు చూసింది. అక్రమ రవాణా చేయడానికి టెండరు రూ.4 లక్షలకు వేసినట్లు తెలిసింది. అక్రమ టెండర్లపై అధికారులు విచారణ చేపట్టారని సమాచారం.

చర్యలు తీసుకోవాలని నిరసన

మెట్‌పల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో జర్నలిస్టుపై దాడికి నిరసనగా మెట్‌పల్లి ప్రెస్‌క్లబ్ ప్రింట్ మీడియా(టీయూడబ్ల్యూజే ఐజేయూ) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎస్సారెస్పీ వంతెనపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. తక్షణమే అరెస్ట్ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దిష్టిబొమ్మ దహనం

కొడిమ్యాల: మండల కేంద్రంలోని అంగడిబజార్ ప్రాంతంలో విశ్వహిందూ పరిషత్, హిందూ సంఘాల ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో చొరబడి అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగుడి దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. విశ్వహిందూ పరిషత్, హిందూ సంఘాలు, హిందూ ఏక్తా సమాజ్ సభ్యులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ అనంతరమే ఉద్యోగ నియామకాలు

మేడిపల్లి : ఎస్సీ వర్గీకరణ అనంతరమే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్, ఎంజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెట్‌పల్లి లక్ష్మణ్, జిల్లా అధికార ప్రతినిధి కాశవత్తుల లక్ష్మీరాజం అన్నారు. మేడిపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 27న జగిత్యాలలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణ ఆధ్వర్యంలో జరగనున్న ధర్మ యుద్ధ సన్నాహక సదస్సుకు హాజరు కావాలని కోరారు. డప్పు ప్రేమ్ సాగర్, లతీష్, గౌతం, రాజ్‌కుమార్ నాగేందర్, వినయ్, వసంత్ పాల్గొన్నారు.

ఆవాసంలో పండ్ల పంపిణీ

జగిత్యాల, న్యూస్‌టుడే: పోలీసుల అమరవీరుల సంస్మరణ సందర్భంగా జగిత్యాల వాల్మీకి ఆవాసంలో పోలీసు అధికారులు సోమవారం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. డీఎస్పీ డి.రఘుచందర్, పట్టణ ఇన్‌స్పెక్టర్ సూరం వేణుగోపాల్, నందెల్లి మదన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత స్థితికి ఎదగాలని సూచించారు.


పండ్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ తదితరులు

ఆలయ అభివృద్ధికి విరాళం

కొడిమ్యాల: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన సరిపెల్లి గంగాధర్-సుజాత కుటుంబ సభ్యులు రూ.25,116 ఆర్థిక సహకారాన్ని ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భారాస ఆరోపణలు అవాస్తవం

మల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టిన రుణమాఫీ కార్యక్రమాన్ని రెండు లక్షల వరకు చేస్తామని ఓ వైపు చెబుతున్నప్పటికీ భారాస నాయకులు ధర్నాలు నిర్వహించి నిరసన వ్యక్తం చేయడం సబబుకాదన్నారు. ప్రతిపక్షాలు రైతులను పక్కదోవ పట్టించేందుకు ఆరోపణలు చేయడం, నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. పూంద్ర శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మృతికి సంతాపం

సారంగాపూర్: ఎన్‌పీడీసీఎల్‌లో సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ రామేశ్వర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. సిరిసిల్ల జిల్లాకు చెందిన రామేశ్వర్‌రెడ్డి కొన్నేళ్లుగా జగిత్యాల జిల్లాలో విధులు నిర్వహిస్తుండగా సారంగాపూర్ మండలంలో సుదీర్ఘ కాలంగా వివిధ హోదాలలో పనిచేశారు. ఇటీవల మల్యాల మండలానికి బదిలీ అయినప్పటికీ అనారోగ్య కారణాలతో విధుల్లో చేరకముందే మృతి చెందాడు. ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

కుక్కలు, కోతుల సమస్య పరిష్కరించాలని వినతి

కొడిమ్యాల: కొడిమ్యాల మండలం చెప్యాల గ్రామంలో కోతులు, శునకాల సమస్య తీవ్రంగా ఉందని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ మాజీ సర్పంచి అక్కపెల్లి రాజేశం సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కోతులు పంటలను, ఇళ్ల పైకప్పులను పాడుచేస్తున్నాయని, అధికారులు స్పందించి కోతులు, కుక్కలను వేరొక చోటుకు తరలించి సమస్యను పరిష్కరించాలని తెలిపారు.

పాఠశాలల ప్రగతికి సహకరించాలి

వెల్గటూరు: పాఠశాలల ప్రగతికి ఉపాధ్యాయ సంఘాలు పూర్తిస్థాయిలో సహకరించాలని మండల విద్యాధికారి బి.ప్రభాకర్ సోమవారం కోరారు. మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .. పాఠశాలల ప్రగతికి, పర్యవేక్షణకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని కోరారు.

సంఘాలు – కార్యవర్గాలు

పెగడపల్లి: ఎమ్మార్పీఎస్ పెగడపల్లి మండల కన్వీనర్‌గా ఎల్లాపూర్ గ్రామానికి చెందిన మోదంపల్లి అంజయ్య నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు గంగారాం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కో కన్వీనర్‌గా కొల్లూరి రమేష్ (నామాపూర్), ఆరెల్లి రాకేశ్ (మద్దులపల్లి)లను నియమించారు.

రాయికల్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండూరి రజినికాంత్, ప్రధాన కార్యదర్శిగా రాచర్ల శ్రీనివాస్‌లను ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య, ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్‌రావు తెలిపారు. నేడు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యలపై నల్లబ్యాడ్జిలతో నిరసన చేపడుతున్నామని అన్నారు.

సంక్షిప్తం

సహకార సంఘం సమావేశం

పెగడపల్లి, న్యూస్‌టుడే: నంచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యవర్గ సమావేశాన్ని మంత్రి వేణుగోపాల్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి ఆడిట్ ఆమోదం, గడువు దాటిన అప్పుల గురించి సమీక్ష, గత తీర్మానాల ఆమోదం వంటి అంశాలపై చర్చించారు. కార్యదర్శి రౌతు మధుకర్, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆహార నాణ్యత అధికారుల తనిఖీ

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: మెట్‌పల్లి పట్టణంలోని ఓ పండ్ల ఎగుమతి దుకాణంలో జిల్లా ఆహార నాణ్యత అధికారి అనూష సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అరటిపండ్లను మాగబెట్టడానికి ఉపయోగించే రిపెనింగ్ ఛాంబర్ల నిర్వహణపై ఎలాంటి పరిజ్ఞానం లేకుండా వినియోగిస్తున్నారని గుర్తించినట్లు తెలిపారు. అరటిపండ్లకు సరైన మోతాదులో ఇథలిన్ అందించడం లేదని పేర్కొన్నారు. రిపెనింగ్ ఛాంబర్లను సీజ్ చేసినట్లు తెలిపారు.

శివాలయంలో రుద్రహోమం

రాయికల్ పట్టణం: రాయికల్ పట్టణంలోని శివాలయంలో రుద్రహోమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని ఆలయ పునరుద్ధరణ కోసం తన వంతుగా రూ.5వేలు అందజేశారు. ఆలయంలో అన్నదానం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ మండలంలోని కుర్మపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో సోమవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

వెల్గటూరు: మండలంలోని పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి కోరారు. ఓటరు నమోదు చైతన్య కార్యక్రమంలో భాగంగా సోమవారం వెల్గటూరులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు ఆయనకు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పలువురు పట్టభద్రులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.